29

# బెటర్ హాఫ్

మనిషి ఆమె అందాన్ని ఆస్వాదించాడు. ఒక అలౌకికానందంలో తేలిపొయ్యాడు.

ఎత్తు పల్లాలు, మైదానాలు, లోయలు, అగాధాలు అన్నీ స్పర్శించాడు. చక్కని తరుచ్ఛాయలలో సేదతీర్చుకుని, హృదయ గులాబీ కురులలో చిక్కుకుందని గొంతు విప్పాడు. విశాలమైన పీఠభూమి ఫాల భాగాన తన అదృష్ట రేఖ లేమైనా కనిపిస్తాయేమోనని వెతికాడు. నల్లని కనుబొమల సోయగాలనూ, కన్నుల ప్రకాశాన్ని గుండెలో దాచుకున్నాడు. రెప్పల సున్నితత్వాన్ని వర్ణించాడు. ఒక్క చూపు కోసం యుగాలు ఎదురు చూశాడు.

కొండల మధ్య ప్రకాశిస్తూ ఉదయించే సూర్యుడు ఆమె నుదుట వెలసిన ఎర్రటి జీవతేజం! మనిషి దానికి కట్టుబడ్డాడు. బాధ్యత వహించాడు.

పూలరంగులన్నీ కలిపి చేసిన చెక్కిళ్ళ మీంచి జారి, పెదాల మీద పదాలల్లాడు. పలవరించాడు. ఆ మెత్తని పెదాల మీద కవిత రాయని భాష లేదు. ఆ చెవులముందు వినిపించని ఘోష లేదు.

హిమగిరి మీద స్కేటింగ్ చేసినంత సుళువుగా మనిషి ఆమె మెడచుట్టూ గిరికీలు కొట్టాడు. ఆమె వక్షపు ఎవరెస్ట్ మీద జెండా పాతాడు.

కొండలను ఒరుసుకు ప్రవహించే పైట నదిలో కొట్టుకు పోయాడు. సముద్రపు ఒడ్డున పేరుకు పోయిన అతి సన్నని ఇసుక బాహువుల్లో తేలాడు.

అది ప్రకృతీ - పురుషుల తన్మయత్వం. స్త్రీ - పురుషుల సహజీవనం. దాన్ని కావ్యాలు, ఘుజఘ్ను మృదంగనాదాలు, గీత బద్ధమూ, సంగీత బద్ధమూ చేశాయి! జీవశాస్త్రం ధృవీకరించింది.

మనిషి ఆరాధించాడు. మనిషి తపించాడు. మనిషి ప్రేమించాడు. మనిషి ద్వేషించాడు. స్త్రీ - ప్రకృతి. ఆమె ఒడిలో మనిషి ఎప్పుడూ పిల్లవాడే. ఎగిరాడు, గెంతాడు, ఆడాడు, పాడాడు. తప్పులు చేశాడు. బుద్ధిమంతుడయ్యాడు. సముద్రాల అగాధాల్ని కొలిచాడు మనిషి. సౌరశక్తిని లెక్కగట్టాడు మనిషి. ప్రకృతి స్త్రీ స్వభావాన్ని అర్థం చేసుకోలేదు మనిషి.

* * *

అర్థంకానిది, లొంగనిది, నశించనిది స్త్రీ - అనుకున్నాడు మనిషి. మనిషి స్త్రీని దేవతను చేశాడు. పూజించాడు. వ్రతాలు, నోములు, నమ్మకాలు అన్నీ ఆమెచుట్టూ తిప్పాడు. అందులోనే ఆమెను గిలగొట్టాడు. ఆదిశక్తిని అబలను చేశాననుకున్నాడు.

శక్తి క్షీణించ లేదు. సృజనాత్మకత ఆరిపోలేదు. కుటుంబంలో అశ్రద్ధ చేయబడుతూనే ఆమె అంతర్గతంగా ఎదిగింది. ఎదుగుతూనే ఉంది. ఆమె పేరు మొల్ల, రాణీరుద్రమ, మేడమ్ క్యూరియే కావొచ్చు. పెరల్‌స్బక్, మదర్ థెరిస్సా, ఇందిరే కావొచ్చు. లతా, మహాశ్వేతా, యమ్మెస్ సుబ్బలక్ష్మి కావొచ్చు. నాడు తెలంగాణా సాయుధ పోరాటంలో గుప్పెడు కారమూ, రోకలితో ఎదురొడ్డి నిల్చిన వీరవనితే కావొచ్చు. నేడు రాజధాని నగర పుర వీధులలో సారావ్యతిరేకోద్యమానికి నేతృత్వం వహిస్తున్న బాధ్యతగల మహిళే కావొచ్చు. ఈ కాలంలో, ఈ రోజుల్లో కూడా మహిళలు అమోఘంగా నిర్వహిస్తున్న ఉద్యమాలున్నాయి. ఆ స్ఫూర్తికై తలవంచాడు మనిషి.

* * *

మనిషికి ఇప్పుడు సంతోషంగా ఉంది. మనిషికి ఇప్పుడు సంతృప్తిగా ఉంది. ఆధునిక యుగ ప్రభావంతో, నాగరిక మహిళ

సాన్నిహిత్యంలో అతని అభిప్రాయం మారింది. దృక్పథం మారింది.

స్త్రీ మనిషికిప్పుడు ప్రకృతి కాదు. తనలాగే ప్రకృతిలో ఒక భాగం. స్త్రీ మనిషికిప్పుడు దేవత కాదు. తనలాగే 'మానవుడు'. స్త్రీ మనిషి కిప్పుడు బానిస కాదు. తనలాగే ఇంటి యజమాని. ఇప్పుడు తాము వేర్వేరు కాదు. ఒక్కటే! బండికి తనొక చక్రం. ఆమొక చక్రం. కాల సూచికలో తనొకముల్లు. ఆమొక ముల్లు.

ఒక చక్రం బండీ, ఒక ముల్లున్న కాలసూచికా సమాజ అంగ వైకల్యానికి ప్రతీక అవుతుంది!

* * *

స్త్రీ అంటే కేవలం అందమో, ఆనందమో కాదు. కేవలం సహనమో, సౌశీల్యమో కాదు. కేవలం సంస్కృతో, సంప్రదాయమో కాదు. కేవలం కన్నీళ్ళో, కడగళ్ళో కావు. వీటన్నిటికలయిక కావొచ్చు. ఒక అభ్యుదయ భావన కావొచ్చు. వెన్నెముకలో జీవ శక్తి కావొచ్చు. మనిషిని మనిషిగా నిలబెట్టగల మనిషి - ఉత్తమ ఇల్లాలు కావొచ్చు.

స్త్రీ కేవలం కలో ఊహో కాదు. వాస్తవం, యధార్థం. స్త్రీ దేవతో దయ్యమో కాదు. కేవలం మనిషి. మనిషిలో SHE ఆమే! MAN లేనిది SHEకి పూర్ణత్వమేదీ?

ఇక MONEY - SHE తో జాగ్రత్తగా మసలుకోవాలను కున్నాడు మనిషి. ఆమెకు విద్య, ఆర్థిక వనరులు వ్యక్తిత్వం అవసరం -

మనిషి తనను రెండు భాగాలు చేసుకున్నాడు. మంచి విశేషణా లన్నీ ఒకవైపు, ఉద్రేకాలు, బలహీనతలు మరొక వైపు విభజించాడు. మంచి భాగాన్ని జీవిత భాగస్వామికి అంకిత మివ్వాలనుకున్నాడు. తన మంచి భాగంలో ఆమెనొక భాగంగా చేసుకోవాలనుకున్నాడు. స్నేహం, అనురాగం, ఆప్యాయతలతో బంధం బలపడాలనుకున్నాడు.

పశ్చాత్తాపంతో క్షాళనం చేయబడి, మనిషి హాయిగా గాలి పీల్చుకున్నాడు. కరుణించి, భరించి, సహించి, క్షమించి ఓపికగా కదిలి వస్తున్న స్త్రీ, ఇప్పుడిక తనలోని పరివర్తనని గుర్తిస్తుంది. 'ఒక నూతన మానవుడు ఆవిర్భవించాడని సంతోషిస్తుంది. కలిసి నడుస్తుంది' - అనుకున్నాడు మనిషి. ఉజ్వల భవిష్యత్తును కల గన్నాడు!

ఆనందంగా స్త్రీని గౌరవించాలనుకున్నాడు.

"రండి మేడమ్! కలిసి నడుద్దాం" - అన్నాడు మనిషి నవ్వుతూ -

ఆమె ఏ దుష్ట ప్రభావాలకు లోనైందో తెలియదు -

"మేడమ్ ఏమిటి? మేడమ్? పురుషాహంకారంతో నన్నింకా ఆడదానిలాగే చూస్తున్నావా?.... నేన్నీతో నడిచే దేమిటి? నువ్వే నాతో నడువ్" - అని ఒక్క విసురు విసిరిందామె.

మనిషి తెల్లబోయాడు -

తేరుకుని, తన ప్రతిపాదనని ముందుంచాడు -

"సరే ఇద్దరికీ పనికొచ్చే సిద్ధాంతం ఏదైతే నేమిటి? అలాగే కానివ్వండి. నా పాత తప్పిదాల్ని సరిదిద్దుకుని, నేను మిమ్మల్ని తోటి మనిషిగా గుర్తిస్తున్నాను."

"అదిగో.... మళ్ళీ అదే పురుషాహంకారం - నువ్వెవరు గుర్తించడానికి?" ఫెడేల్ మనే జవాబు విసిరిందామె. "యుగ యుగాలుగా నన్ను హింసిస్తూ వచ్చావ్. నాలో ప్రతి కణమూ నిన్ను ద్వేషిస్తోంది. నా కణఘోష వినిపిస్తా. నా ప్రతి అవయవంతో మాట్లా డిస్తా. పురుష వాదాన్ని మట్టి కరిపిస్తా. ఈ కాలం మీద నాదే

అయిన కవిత్వాన్ని రుద్దుతా. అలుకుతా.... ఛిమ్ముతా. అప్పుడు గాని నా కసి కసి.... క్కసి.... క్కసి.... తీ.... ర.... దు!!

'ఆమె' లోని ఒక సూక్ష్మభాగం వెర్రితలలు వేసింది.

మనిషి "పక్ష"వాతంతో దేన్నో అన్వేషిస్తూ, దేనికోసమో బతుకుతూనే ఉన్నాడు.

○

మనిషి'కత'లు
అన్నీ రచన మాస పత్రికలో ప్రచురితం
1992 — 93